15

# బుద్ధిలేని చెవులు

అనగనగా ఒక ఊరిలో నర్సమ్మ అనే పేదరాలు ఉండేది.

ఆమెకు ఒక్కగానొక్క కొడుకు - రాము ఉండేవాడు. వాడి పసితనంలో తండ్రి చనిపోవడంతో ఎంతో కష్టంమీద కొడుకుని పెంచుతూ వచ్చింది నర్సమ్మ. రాముకి తల్లి అంటే విపరీతమైన ప్రేమ. అప్పటికి వాడికి పదేళ్ళు వచ్చాయి.

ఒకరోజు నర్సమ్మ దిగులుగా కూర్చొంది.

అది చూసి రాము- "ఎందుకమ్మా... అలా వున్నావు?" అనడిగాడు.

"ఏం చెప్పను నాయనా... చీర చిరిగి పాతదైపోయింది. కుట్టుకుందామంటే ఈ దిక్కుమాలిన కొంపలో ఒక సూది కూడా లేదు" అంటూ కళ్ళ నీరెట్టుకుంది.

అది చూసి రాము హృదయం కరిగి పోయింది.

వెంటనే బయటికి వెళ్ళిపోయాడు.

ఎరుగున్న షావుకారు కొట్టుకెళ్ళి అక్కడ కూర్చున్న షావుకారుతోనూ, మిగిలినవారితోనూ కబుర్లు చెప్తూ కూర్చున్నాడు. రాము చలాకీగా, అందంగా ఉండడంతో వాడితో మాట్లాడడం ఇతరులకు సరదాగా ఉండేది.

షావుకారు పరధ్యాసగా వున్నపుడు అదను చూసుకొని ఒక సూదిని ఎత్తుకొచ్చాడు రాము. దానిని తీసికెళ్ళి సంతోషంగా తల్లి చేతిలో పెట్టాడు.

అది చూసి "ఎక్కడిదిరా ఇది? భలేగా తెచ్చావే?" అని అడిగింది నర్సమ్మ.

"షావుకారు కొట్లో దొంగిలించి తెచ్చానమ్మా..!" అని నిజం చెప్పాడు రాము.

నర్సమ్మ ఏమీ మాట్లాడలేదు. కానీ, ఆమె కళ్ళలో తృప్తి, సంతోషాన్ని గమనించాడు రాము.



తన పనిని తల్లి హర్షించడంతో ఇంక చిల్లర దొంగతనాలను చురుకుగా చేయడం మొదలుపెట్టాడు.

ఇంటికి కావలసిన వస్తువులన్నీ ఒకటొకటి అమరుతుండడంతో, తన కొడుకు ప్రజ్ఞావంతుడైనందుకు సంబరపడిపోయింది నర్సమ్మ.

రాము పెద్దవాడయ్యాడు. దొంగతనాల్లో పెద్ద అనుభవం సంపాదించాడు. అప్పటికి వాళ్ళు ఉన్న ఊరు వదిలి నగరానికి మకాం మార్చారు.

నర్సమ్మ బాగా పెద్దదయిపోవడంతో- ఒక్కతే పని చేసుకోలేక, కొడుకును పెళ్ళి చేసుకోమని పోరడం మొదలుపెట్టింది.

"తగినంత డబ్బూ, బంగారం,నగలూ తెచ్చిన తర్వాత పెళ్ళి చేసుకుంటాను "అని చెప్పాడు రాము.

ఒకసారి రాజుగారు వేటకెళ్లడం, రాణిగారు చెలులతో పరాయి ఊళ్ళో రథోత్సవం చూడడానికి వెళ్లడం జరిగింది.

అదే మంచి అదనని కోటలో జొరబడ్డాడు రాము.

అంతా బాగానే జరిగింది కానీ.., చివరి నిముషంలో దొంగిలించిన బంగారం, నగలతో సహా పట్టుబడ్డాడు. మర్నాడు వాడిని రాజుగారి ముందు ప్రవేశపెట్టారు.

రాజుగారు విచారించి రాముకి ఉరిశిక్ష విధించారు.

ఉరి తీసేముందు ఆనవాయితీ ప్రకారం చివరి కోరికను కోరుకోమన్నారు.

రాము తన తల్లిని దగ్గరకు తీసుకురమ్మని కోరాడు. వెంటనే నర్సమ్మని తెచ్చారు.

తల్లి దగ్గరకు రాగానే ఆమె చెవులు రెండూ సాగదీసి మెలివేయసాగాడు.

బాధతో గిలగిల్లాడుతూ భయంకరంగా అరవసాగింది నర్సమ్మ. అతి కష్టమ్మీద ఆమెను విడిపించారు భటులు.

"కన్న తల్లిని.., అందులోనూ- ముసలమ్మను ఇలా హింసించడంలో నీ ఉద్దేశం ఏమిటి?" అని కోపంగా అడిగారు రాజుగారు.

"అవును ప్రభూ..! నేను మొదటిసారి సూదిని దొంగతనం చేసినప్పుడు వచ్చి ఈమె చెవిలో దొంగిలించిన విషయం చెప్పాను. ఆమె విని ఊరుకుంది. అప్పుడే నా చెవులు సాగదీసి బుద్ధి చెప్పి ఉంటే ఈ రోజు నాకీ దుర్గతి వచ్చి వుండేది కాదు గదా..!" అంటూ ఏడుస్తూ తన కథ వివరంగా చెప్పాడు రాము.

రాముకి తల్లి పట్ల గల ప్రేమకు ముగ్ధులయ్యారు రాజుగారు.

"నేను కొలువు ఇస్తాను. ఇంకెప్పుడూ దొంగతనాలు చేయకు" అని రాముని క్షమించి వదిలేశారు రాజుగారు.

రాజుగారి మంచితనంతో మనసు మార్చుకున్న రాము- మరెప్పుడూ దొంగతనం చేయలేదు. ఎంతో వినయ విధేయతలతో తన కొలువు చేసుకుంటూ అందరి మెప్పు పొందాడు. ఆ విధంగా ఒక దొంగ బెడద రాజ్యంలోని ప్రజలకూ తప్పింది.

★★★